రంజాన్ వేళలు
ఇఫ్తార్ (గురు) సా.6.21
సహరి (శుక్ర) ఉ.4.50

రెండోసారి..
వంతెన నిర్మాణ పనులకు నాడు భూమి పూజ...
నేడు శిలాఫలకం ఆవిష్కరణ... 7లో

వయో వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 85 ఏళ్ల పైబడిన వయో వృద్ధులతో పాటు 40శాతం పైబడి దివ్యాంగత్వం ఉండి సదరం సర్టిఫికెట్ పొందిన వారు ఈసారి ఎన్నికల్లో ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. లోక్‌సభ స్థానం కోసం పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థిరూ.40లక్షల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉందన్నారు. ఎన్నికల ఖర్చుల వివరాలను ఎలా అందించాలో తెలియజేశారు. అభ్యర్థులు చేసే ఖర్చులపై వ్యయ పరిశీలకుల నిఘా ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు తమ ఆస్తులతో పాటు తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలన్నారు. పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థి రూ.25వేలు, అసెంబ్లీకి పోటీ చేసే అభ్యర్థి రూ.10వేలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఒక అభ్యర్థి ఒక ఎన్నికల్లో గరిష్ఠంగా రెండుచోట్ల మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా 1,644 పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసినట్టు స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ టి.వైద్యనాథ్‌శర్మ, రాజకీయపార్టీల ప్రతినిధులు దూరి రాజేష్, కామన ప్రభాకరరావు, సంసాని బులినాని, పి.పవన్ సూర్య, కాశి లక్ష్మీభవానీ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు గ్రైండర్లు, మిక్సీలు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు రూ.16.80 లక్షలతో వసతిగృహాలకు వంట సామగ్రి

అమలాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 55 బీసీ, ఎస్సీ వసతిగృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఓఎన్జీసీ, రిలయన్స్, గెయిల్ సంస్థలు ముందుకు వచ్చాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఓఎన్జీసీ సీఎస్సార్ నిధులు రూ.16.80 లక్షలతో 37 వసతి గృహాలకు కుక్కర్లు, గ్రైండర్లు, మిక్సీలు, ఇడ్లీ స్టీమర్లను సమకూర్చగా బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా వాటిని విద్యార్థులకు అందజేశారు. త్వరలోనే ఓఎన్జీసీ సహకారంతో ఫ్రిజ్‌లు, వాటర్ కూలర్లు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, సీపీవో వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సాంబమూర్తి, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి, ఓఎన్జీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

క్షణ క్షణం



- కోనసీమ జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- నేడో రేపో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల ప్రకటన
- 16లోగా వైసీపీ అభ్యర్థుల జాబితా
- అమలాపురంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- లోక్‌సభ టీడీపీ రేసులో ముగ్గురు అభ్యర్థులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాజకీయాలు క్షణక్షణం ఉత్కంఠ భరితంగా మారిపోతున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న అభ్యర్థుల రాజకీయ భవిష్యత్తును నిర్దేశించేందుకు ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. దాంతో లోక్‌సభ, అసెంబ్లీ టిక్కెట్లు ఆశిస్తున్న వారు ఆయా పార్టీల అధిష్ఠానాల అనుగ్రహం కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలతో పాటు అధికార వైసీపీ కూడా అభ్యర్థుల జాబితాలను అధికారికంగా విడుదల చేస్తామని చేసిన ప్రకటనలతో ఆయా పార్టీల సీట్ల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థుల్లో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటికే నాలుగుచోట్ల అభ్యర్థులను టీడీపీ-జనసేన ప్రకటించింది. ఇక మిగిలిన మూడు స్థానాల్లో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. రాజోలు అసెంబ్లీకి జనసేనకు చెంది సీనియర్ ఐఏఎస్ అధికారి దేవ వరప్రసాద్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం సూత్రప్రాయంగా ఖరారుచేసి ప్రచారానికి సిద్ధం కావాల్సిందిగా ఆదేశించినట్టు నియోజకవర్గానికి చెందిన జనసేన-టీడీపీ నేతలు చెప్తున్నారు. జనసేన ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

అమలాపురం అసెంబ్లీ సీటు అటు టీడీపీ, ఇటు జనసేనలను ఇంకా టెన్షన్‌లోనే ఉంచింది. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించే రెండో జాబితాలో అమలాపురం ఉంటుందా లేదా అనేది చర్చనీయాంశమైంది. జనసేన నుంచి టిక్కెట్ ఆశిస్తున్న సీనియర్ అధికారి డీఎంఆర్ శేఖర్, శెట్టిబత్తుల రాజబాబు ఇప్పటికే తమ అనుచరగణాలతో అమరావతిలో మకాంవేసి అమలాపురం టిక్కెట్ సాధించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు తన అనుచరగణంతో వారం నుంచి అక్కడే మకాంవేసి పట్టువదలని విక్రమాడిలా టీడీపీ టిక్కెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఆ పార్టీ అధిష్ఠానం మదిలో మరికొందరి పేర్లు కూడా పరిశీలనలో ఉండవచ్చని విశ్వసనీయంగా తెలిసింది.

రామచంద్రపురం సీటు కోసం బీసీలు తీవ్రంగా పోటీపడుతున్నారు. టీడీపీ నుంచి శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన కాదా వెంకటరమణ, వాసంశెట్టి సుభాష్ పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది. జనసేనకు ఇస్తే పితాని బాలకృష్ణ, చిక్కాల దొరబాబు పేర్లు పరిశీలించే అవకాశాలు ఉన్నాయి.

పి.గన్నవరంపై స్పష్టత రావాల్సి ఉంది. టీడీపీ అధిష్ఠానం గతంలో సరిపెల్ల రాజేష్ (మహాసేన రాజేష్) పేరు ప్రకటించింది. అయితే నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నేతలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గుతున్నట్టు స్వయంగా ప్రకటించారు. అయితే తాజాగా గన్నవరం నుంచి తానే బరిలో ఉంటానని, అధిష్ఠానం తనను వెనక్కి తగ్గమని చెప్పలేదని చేసిన ప్రకటనతో మళ్లీ ఉత్కంఠ నెలకొంది. పొత్తులో భాగంగా టీడీపీకి బదులు జనసేనకు ఈ సీటును ప్రకటిస్తే గిడ్డి సత్యనారాయణ పేరు ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్టు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆయన జనసేన పార్టీ కార్యాలయం వద్ద తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు.

అమలాపురం లోక్‌సభ స్థానం విషయంలో టీడీపీ నుంచి ప్రధానంగా ముగ్గురి పేర్లను పరిశీలిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆశావహుల జాబితాలో లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్‌తో పాటు మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు కుమార్తె డాక్టర్ సత్యశ్రీ, పారిశ్రామికవేత్త డాక్టర్ వై.రమేష్‌బాబు ఉన్నట్టు సమాచారం. అమలాపురం అసెంబ్లీ సీటు లోక్‌సభ అభ్యర్థి ప్రకటనపై ఆధారపడుతుందని ప్రచారం జోరుగా సాగుతుంది.

మరోవైపు వైసీపీ తరపున టిక్కెట్లు ఆశిస్తున్న అభ్యర్థులు పార్టీ అధిష్ఠానం ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు. రాజోలు సిట్టింగ్ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్‌ను అమలాపురం లోక్‌సభ సమన్వయకర్తగా, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును రాజోలు అసెంబ్లీ సమన్వయకర్తగా నియమించగా వారి మధ్య అభిప్రాయబేధాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థుల్లో మార్పు చోటు చేసుకోవచ్చుని ఆ పార్టీ పరిశీలకులు భావిస్తున్నారు. మిగిలిన స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేల పేర్లనే ప్రకటించే అవకాశం ఉంది. సీఎం జగన్ ఈ నెల 16వ తేదీలోగా అభ్యర్థుల జాబితాను ఖరారు చేయనున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ రాజకీయ భవితవ్యం కోసం ఎదురు చూస్తున్నారు.



ఓటు వజ్రాయుధమని ముద్రించిన గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నీ ఓటు... నీ భవిష్యత్తు

అమలాపురం టౌన్, మార్చి 13: ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ దానిని వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ఓటు హక్కు విలువలు తెలుపుతూ ముద్రించిన గోడ పత్రికలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం ఆయన ఆవిష్కరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. నీ ఓటు.. నీ భవిష్యత్తు అని నినదిస్తూ ఓటును అమ్ముకోవద్దు. నిస్వార్థ సేవలు అందించే వారినే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలన్నారు. ఓటును అమ్ముకోవడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డివిజనల్ ఇంజనీర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

దాళ్వా చేలకు సాగునీరిచ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉప్పలగుప్తం, మార్చి 13: ఉప్పలగుప్తం ప్రధాన పంటకాల్వ శివారు పేరాయి చెరువు, ఆదిలక్ష్మీపురం ప్రాంతాల దాళ్వా చేలకు అధికారులు సాగునీరిచ్చారు. 'పంట తడి కోసం కంటతడి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తహసీల్దారు మల్లికార్జునరావు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడగా వారు పరిస్థితిని పరిశీలించి నీరందించారు. వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు బుధవారం పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.





మొల్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్

మానవతా విలువలకు రామాయణం పట్టుకొమ్మ

కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంల్లో అధికారికంగా తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ జయంతి

అమలాపురం టౌన్, మార్చి 13: మానవతా విలువలకు రామాయణం పట్టుకొమ్మగా నిలుస్తుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. దేశ సంస్కృతిలో రామాయణ, మహాభారత ఇతిహాసాల్లో సదాచారం, నీతి నియమాలు, భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు కనిపిస్తాయని వివరించారు. కలెక్టరేట్‌లో బుధవారం మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు జరిపారు. 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి అయిన మొల్ల తెలుగులో రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. సరళమైన రచనా శైలి ఆమె సొత్తన్నారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొల్ల ఏ విధమైన సంప్రదాయ విద్యా అభ్యసించలేదన్నారు. తన సహజ పాండిత్యానికి భగవంతుడే కారణమని మొల్ల చెప్పేదన్నారు. తన రామాయణ రచనను శ్రీరామచంద్రునికి అంకితం చేసిన ఘనత మొల్లకు దక్కుతుందన్నారు. 2017లో రాష్ట్ర ప్రభుత్వం మొల్ల పేరిట స్టాంపు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వై.సాంబమూర్తి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

తొలి తెలుగు కవయిత్రి, రామాయణ గ్రంథ తెలుగు అనువాది మొల్లమాంబ చిత్రపటానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. మొల్ల తన రచనలతో సామాజిక స్పృహ కోసం ఎంతో పాటుపడిందన్నారు. మూఢ నమ్మకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన వీర వనితగా కొనియాడారు. మొల్ల రామాయణం విశిష్టతను వివరించారు. అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, స్పెషల్ బ్రాంచి సీఐలు బి.రాజశేఖర్, వి.శ్రీనివాస్, ఏఆర్ ఇన్‌స్పెక్టర్, ఏఆర్ పోలీసులు, ఏవో జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.





బండారులంకలో పూర్తికాని సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, సర్పంచ్ సునీత

హడావిడిగా...

- ఎన్నికల కోడ్ వస్తుందని.. మంత్రి విశ్వరూప్ హంగామా
- పూర్తికాని సచివాలయ భవనం
- సెల్‌ఫోన్ లైట్ల వెలుగులో ప్రారంభం

అమలాపురం రూరల్, మార్చి 13: ఏ క్షణమైనా ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ బుధవారం పలు అభివృద్ధి పనులకు హడావిడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. బండారులంక గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక సచివాలయ భవన నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. కనీసం విద్యుత్ సదుపాయం కూడా కల్పించలేదు. ఆ భవనాన్ని రాత్రి సమయంలో సర్పంచ్ పెనుమాల సునీతతో మంత్రి ప్రారంభింపజేశారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాల గదులను సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే మంత్రి సమక్షంలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. తొలుత గ్రామంలోని పలు రోడ్లు, ఆర్బీకే భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, కుడుపూడి బాబు, దంగేటి రుద్ర, బొంతు గోవిందుశెట్టి, ఎంపీటీసీ అంకం హిమభారతి, అంకం పెదరాజు, జాన గణేష్, కూర్మా క్రీస్తుఏసు తదితరులు పాల్గొన్నారు.





మధుసూదనరావుకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

మా సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలి

సమగ్ర శిక్షా ఏపీసికి సమగ్ర కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి

ముమ్మిడివరం, మార్చి 13: సమగ్ర శిక్షాలో పనిచేస్తున్న తమ సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం ముమ్మిడివరంలో అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావుకు వినతిపత్రం అందజేశారు. సమ్మె కాలపు జీతాల విడుదలకు తగు చర్యలు తీసుకోవాలని, ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని, సీఎఫ్ఎంఎస్ పరిధిలో ఉంచి వాటి ద్వారా జీతాలు ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికీ సంవత్సరానికి 15 క్యాజువల్ లీవ్‌లు, మహిళ ఉద్యోగులకు అదనంగా ఐదు క్యాజువల్ లీవ్‌లు ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకన్నబాబు, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాస్, వి.వెంకటరమణ, జె.గౌతమ్‌ప్రసాద్, బి.జాన్‌బాబు, ఎస్కే రహ్మాన్, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు.

19 నుంచి కోరుకొండ తీర్థం ప్రారంభం

- ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు
- ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన అధికారులు, పండితులు





పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, పండితులు

కోరుకొండ,మార్చి13: శతాబ్దాల చరిత్ర కలిగిన కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అలయ ముఖ మండపం నందు దేవస్థానం చైర్మన్ పరాసర రంగరాజభట్టర్ స్వామి, దేవస్థానం పర్యవేక్షణాధికారి కాపవరపు సూర్యనారాయణ, ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి, చంగన వీర్రాజు, వీఎస్ అనీల్‌కుమార్ తదితరులు ఉత్సవాలకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దీని ప్రకారం ఈ నెల 19వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు వైఖానస ఆగమ పండితులు పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు, అనువంశిక అర్చక స్వాములు స్వామి వారి కోనేరు వద్ద నుంచి పుట్ట మన్ను తెచ్చి అంకురార్పణ, ధ్వజారోహణం చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 20వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామి వారి రథోత్సవం. రాత్రి 9 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం, 21వ తేదీ గురువారం కొండపైన, కొండ దిగువున స్వామి వారి దర్శనాలు, రాత్రి 9గంటలకు స్వామి వారికి గరుడ వాహన సేవ నిర్వహిస్తారు. 22వ తేదీ శుక్రవారం ఉదయం నిత్యోపాసనతో స్వామివారి దర్శనాలు ప్రారంభమవతాయి. రాత్రి 7 గంటలకు స్వామి వారి ఆలయ ముఖ మండపంలో వేద పండితుల సమక్షంలో స్వామి వారికి సదస్యం జరుగును. రాత్రి 9 గంటలకు హనుమద్ వాహనంపై స్వామి గ్రామోత్సవం జరుగుతుంది. 23వ తేదీ శనివారం స్వామి వారి నిత్యోపాసన అనంతరం దర్శన ఏర్పాట్లు చేస్తారు. రాత్రి 9గంటలకు స్వామి వారికి గజవాహనంపై గ్రామోత్సవం. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీ రంగరాజ స్వామి ఆలయంలో రంగరాజస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 24వ తేదీ ఆదివారం శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారికి ఉదయం 9 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి, శ్రీ అనంతపద్మనాభ స్వామివారి సమక్షంలో దేవుని కోనేటి వద్ద శ్రీ చక్ర పెరుమాళ్ళకు పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అనంతరం చక్ర తీర్థం జరుగుతుంది. సాయంత్రం ధ్వజారోహణ, అద్దాల సేవ, ఊంజల సేవ నిర్వహిస్తారు. రాత్రి 9గంటలకు స్వామివారి శేషవాహనంపై గ్రామోత్సవం జరుగుతుంది. 25వ తేదీ సోమవారం సాయంత్రం స్వామి వారికి ద్వాదశప్రదక్షిణలు, ద్వాదశ నివేదనలు, పర్యాంక శయనోత్సవం, శ్రీ పుష్పయాగం జరుగుతుందని రంగరాజభట్టర్ స్వామి తెలిపారు.



అధికారులు, ఉపాధ్యాయులతో విద్యార్థులు

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కు ప్రాజెక్టుల ఎంపిక

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నుంచి రెండు వైజ్ఞానిక ప్రదర్శనలు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయని జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ చిత్తూరు జిల్లా గంగవరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ జరిగిందన్నారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బైసెట్టి లక్ష్మణ్, గైడ్ టీచర్ మల్లిపూడి రాజు రూపొందించిన రైతుబంధు అనే వ్యవసాయ యంత్రం, సీతానగరం మండలంలోని రఘుదేవపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె.నాగేంద్రకుమార్, గైడ్ టీచర్ జి.శేఖర్ రూపొందించిన చేతితో సులభంగా కొబ్బరికాయ ఒలిచే యంత్రం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు. విద్యార్థులను, గైడ్ టీచర్లను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి, డిప్యూటీ ఈవో ఈవీబీఎన్ నారాయణ, జిల్లా సైన్సు అధికారి నెహ్రూ అభినందించారు. రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

జాతీయ సైన్స్ పోటీలకు ఎంపిక



కాకినాడ రూరల్,మార్చి13: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు కాకినాడ జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ అర్బన్ మండలం గొడారిగుంట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన గుత్తుల అనుష్క రూపొందించిన సీడర్ ఫర్ స్మాల్ స్కేల్ ఫార్మర్స్ అనే ప్రాజెక్టు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 11నుంచి 13వతేదీ వరకూ చిత్తూరు జిల్లా పలమనేరులో రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్ పోటీలు నిర్వహించారన్నారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి దేవరాజు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 240 ప్రాజెక్టులు ప్రదర్శించగా వాటిలో 24 ప్రాజెక్టులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాయన్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా నుంచి జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టును రూపొందించిన గుత్తుల అనుష్కను, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు చంద్రారెడ్డిని ఆర్జేడీ జి.నాగమణి, డీఈవో పి.రమేష్, డీవైఈవో ఆర్జే డేనియల్ రాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అభినందించారు.

ఇదేం స్పీడు..

ఊబలంక ర్యాంపు వద్ద లారీ డ్రైవర్లతో వైసీపీ యువకుల వాగ్వాదం

అనంతరం పార్టీ పెద్దలతో చర్చలు

'లెక్క' తేలక ఊబలంక ఇసుక ర్యాంపు నిలిపివేత



నిలిచిపోయిన తవ్వకాలు

రావులపాలెం, మార్చి 13: ఇసుక ర్యాంపులకు అనుమతులు లేకపోయినా ఊబలంక ప్రాంతం నుంచి రోజుకు వందలాది లారీల్లో ఇసుక తరలిపోతోంది. ఇదే విషయంపై వైసీపీ నాయకులను ఆ పార్టీలోని యువకులే ప్రశ్నించారు. అసలు ఇసుక ఎక్కడికి పోతోంది. ఆదాయం ఎక్కడికి వెళ్తోంది..అనే కోణంలో ప్రశ్నల వర్షం కురిపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ఊబలంక ఇసుక ర్యాంపు నుంచి నిబంధనలకు విరుద్ధంగా రోజూ వందలాది లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి మితిమీరిన వేగంతో లారీలు ప్రయాణిస్తుండడంతో గ్రామంలో వైసీపీకి చెందిన యువకులు ర్యాంపులోకి వెళ్లి లారీ డ్రైవర్లను నిలదీశారు. మితిమీరిన వేగంతో వెళ్తున్న కారణంగా లారీల్లో ఇసుక లోడ్ చేయడాన్ని అడ్డుకున్నారు. దీంతో డ్రైవర్లు, యువకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇసుక జట్టు మేస్త్రీ వారిని వారించే ప్రయత్నం చేసి ఘర్షణకు దిగాడు. దీంతో యువకులు ఆవేశానికి గురై ర్యాంపు మూసివేయాలని నినాదాలు చేశారు. కాగా యువకులతో రావులపాలెంలోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ పెద్దలు చర్చలు జరిపినట్టు సమాచారం. ఆ సమయంలో యువకులు ఇసుక ర్యాంపు ఎవరు నడుపుతున్నారు.. ర్యాంపు నుంచి వచ్చే ఆదాయం ఎక్కడికి వెళ్తోంది... గతంలో ఏ విధంగా నడిచేది... ఇప్పుడు ఏ విధంగా నడుస్తోంది అని పెద్దలను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య చర్చలు ఫలించకపోవడంతో ఇసుక ర్యాంపు తాత్కాలికంగా మూతపడింది. అయితే గ్రామంలో మరోమారు చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

సార్.. గురు దక్షిణ

కాకినాడలో ఓ బీజేపీ ఆశావహ అభ్యర్థి అప్పుడే డబ్బుల ఎర

టికెట్ ప్రయత్నాలకు ఆశీర్వాదం కోరుతూ బీజేపీ కీలక నేతలకు స్వీట్ బాక్సులు

అందులో రూ.20వేల వరకు నగదు ఉంచి అందజేత

గురు దక్షిణ తీసుకోవాలంటూ స్వయంగా కలిసి విన్నపం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి) కాకినాడలో ఓ ప్రముఖ ఇంజనీరింగ్ విద్యాసంస్థ యజమాని టికెట్ కోసం ఏకంగా బరితెగించేశాడు. బీజేపీలో సీనియర్ నేతలకు స్వీట్ బాక్సులు పంపి అందులో నగదు కవర్ అందించడం తీవ్ర దుమారం రేపుతోంది. కాకినాడ సిటీ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తున్న ఈయన కొన్ని రోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పొత్తులో భాగంగా బీజేపీ పది అసెంబ్లీ సీట్లు దక్కించుకున్న నేపథ్యంలో అందులో కాకినాడ సిటీ సీటు కూడా ఉండేలా చూడాలని, ఆ టికెట్ తనకు వచ్చేలా ఆశీర్వదించాలంటూ నగరంలో అనేకమంది బీజేపీ సీనియర్ నేతలందరినీ కలుస్తున్నారు. వారందరికీ శాలువాలు కప్పి స్వీట్ బాక్సులు అందిస్తున్నారు. అందులో రూ.20 వేల వరకు నగదు ఉంచి గురుదక్షిణ అంటూ వారి కాళ్లపై పడుతున్నారు. తీరా స్వీటు బాక్సులు తెరిచి చూస్తే అందులో నగదు ఉండడం చూసి బీజేపీ నేతలు అవాక్కవుతున్నారు. అసలు సదరు నేత ఇంకా బీజేపీలో కూడా చేరలేదు. కానీ నగరం అంతటా మోదీని పొగుడుతూ ఫ్లెక్సీలు కూడా ఏర్పాటు చేశారు. అటు ఆరెస్సెస్ నేతలను కలిసి సీటు ఆశీర్వాదం పొందారని ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా స్వీటు బాక్సులు అందుకున్న కొందరు సీనియర్లు వాటిని వెనక్కు తిప్పి పంపేశారు. గురుదక్షిణ పేరుతో తమకు డబ్బులు ఇవ్వడంపై ఫోన్ చేసి చివాట్లు కూడా పెట్టారు. పార్టీలో లేని సంస్కృతిని తీసుకురావడంపై మండిపడుతున్నారు. కాగా సదరు విద్యాసంస్థల యజమాని కాకినాడ సిటీ, పిఠాపురం తదితర స్థానాల్లో గతంలో పలు పార్టీల నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యారు.

నేను గెలిచేందుకు సాయం చేయండి

మీకు ఇబ్బందొస్తే నేను చూసుకుంటా

వలంటీర్లతో కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



ఓటర్ల లిస్టును పరిశీలిస్తున్న వలంటీర్లు, గృహసారథులు

రావులపాలెం, మార్చి 13: 'వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నా విజయానికి మీరు కృషి చేయండి.... మీకు ఏదైనా ఇబ్బంది వస్తే నేను చూసుకుంటా' అని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి వలంటీర్లకు దిశానిర్దేశం చేశారు. రావులపాలెంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఆయన బూత్ ఏజెంట్లు, గృహ సారథులు, వైసీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి వలంటీర్లు కూడా హాజరుకావడం విశేషం. రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాలకు చెందిన వారు హాజరు కాగా టేబుళ్లు, కుర్చీలు వేసి వారి ముందు ఓటర్ల జాబితాలు పెట్టారు. 2019 ఎన్నికల్లో బూత్‌ల వారీగా వచ్చిన మెజారిటీ, ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి అన్న అంశాలను పరిశీలించారు. బూత్‌లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి వివరాలనూ సేకరించారు. అనంతరం జగ్గిరెడ్డి టేబుళ్ల వద్దకు వెళ్లి అక్కడున్న వారికి వైసీపీకి ఓట్లు పడేలా చూడాలని సూచించారు. మీకు కేటాయించిన కుటుంబాల వారు వైసీపీకి ఓటు వేసేలా ఓటర్లను చైతన్యపరచాలని వలంటీర్లకు స్పష్టం చేయడం విశేషం.

రెండోసారి..

వంతెన నిర్మాణ పనులకు నాడు భూమి పూజ...

నేడు శిలాఫలకం ఆవిష్కరణ

ఎన్నికల వేళ వైసీపీ నాయకుల హంగామా



పనులు జరుగుతున్న దృశ్యం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న నాయకులు

పి.గన్నవరం, మార్చి 13: అప్పుడు భూమి పూజ చేశారు... ఇప్పుడు ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి వైసీపీ ప్రజాప్రతినిధులు చేస్తున్న పీట్లు అన్నీ ఇన్నీ కావు. ఈ విచిత్ర పరిస్థితి గంటి పెదపూడిలో బుధవారం చోటుచేసుకుంది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి శివారు మూడు గ్రామాలు, ఉడిమూడి శివారు ఒక గ్రామానికి చెందిన లంక గ్రామస్తులు రాకపోకలు సాగించడానికి వంతెన నిర్మాణం నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో రూ.49.50 కోట్లు మంజూరయ్యాయి. కాగా గతేడాది అతికష్టం మీద ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీకి టెండర్లను ఖరారు చేశారు. అనంతరం వంతెన ఏర్పాటు విషయమై రెండు లంక గ్రామాల మధ్య నెలకొన్న విభేదాలను సైతం అధిగమించి చింతావారిపేట వద్ద వంతెన పనులకు గత ఏడాది మార్చి 22న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు భూమి పూజ చేశారు. వంతెన పనులు ఇప్పటికే 50శాతానికి పైగా పూర్తి కాగా ప్రధాన వంతెన పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన వంతెన పనుల సమీపంలో ఏటిగట్టుపై గతేడాది ప్రొటోకాల్ ప్రకారం శిలాఫలకం ఏర్పాటు చేశారు. బుధవారం దానిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆర్భాటంగా ప్రారంభించారు. సర్పంచ్ దంగేటి అన్నవరం మినహా మిగిలిన స్థానిక ప్రజాప్రతినిధులు ఎవ్వరూ హాజరు కాలేదు. అనధికార కార్యక్రమం కావడంతో అధికారులు సైతం దూరంగా ఉన్నారు. ప్రారంభించిన పనులనే మళ్లీ ప్రారంభించి వైసీపీ నాయకులు హంగు, ఆర్భాటం చేశారని ప్రజలు వ్యాఖ్యానించారు.

ఏప్రిల్ 5 నుంచి ఆర్ట్స్ కళాశాలలో రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్ పేరుతో ఏప్రిల్ 5, 6, 7 తేదీల్లో రాష్ట్రస్థాయి యూత్ ఫెస్టివల్ జరగనుంది. కళాశాల ఆవరణలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో యూత్ ఫెస్టివల్‌కు ఉద్భవ్ అనే పేరును నిర్ణయించారు. కళాశాల విద్యార్థిని శివశంకరి ఆధ్వర్యంలో విద్యార్థులు తమ చేతి గుర్తులతో వేసిన బ్యానర్‌ను కళాశాల భవనంపై ఆవిష్కరించారు. విద్యార్థి వ్యాపారాభివృద్ధి (స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్) అనే నినాదంతో యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ అధ్యాపకుల ప్రమేయం లేకుండా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులు నిర్వహించే మొదటి స్టూడెంట్ ఫెస్ట్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డి.సంజీవ్‌కుమార్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, ఫెస్ట్ కో ఆర్డినేటర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

గోపాలపురం, మార్చి 13: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని వాహనాన్ని రెవెన్యూ, పోలీస్ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఎస్‌డీటీ తాతపూడి దివాకర్, పోలీస్ సిబ్బంది సహకారంతో రూ.2 లక్షల 8 వేలు విలువ చేసే పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకుని వాహనం సీజ్ చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం ఉదయం 11గంటల సమయంలో విధులు నిర్వహిస్తుండగా గోపాలపురం శివారులో ఉన్న పెట్రోల్ బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఐషర్ వ్యాన్ పై పీడీఎస్ బియ్యం తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. 130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.2 లక్షల 8 వేలు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లాకు చెందిన అల్లుమల్లు రాముని అదుపులోకి తీసుకుని సీఎస్‌డీటీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.

వర్చువల్‌గా ప్రధానమంత్రి సూరజ్ పథకం ప్రారంభం



వర్చువల్‌గా పథకాన్ని ప్రారంభిస్తున్న మోదీ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 13 : ప్రధానమంత్రి సూరజ్ పథకాన్ని బుధవారం సాయంత్రం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన దూరదర్శన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డీవీ ప్రసాద్, సాంఘిక సంక్షేమాధికారి సందీప్ మాట్లాడుతూ సూరజ్ పథకంలో పారిశుధ్య కార్మికులకు జిల్లాలోని కొవ్వూరు పురపాలక సంఘం పరిధిలో 4 కిట్లు, నిడదవోలు పురపాలక సంఘం పరిధిలో 29 కిట్లు అందజేసినట్టు తెలిపారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ఆర్థిక సంస్థ ద్వారా సహాయం పొందిన సఫాయి కర్మాచారి లబ్ధిదారులకు, ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా ఆర్థిక సహాయం పొందిన బీసీ స్వయం ఉపాధి లబ్ధిదారులకు రూ.14,50,68,219ల ఆర్థిక ప్రయోజనం చేకూర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు పి.సువర్ణ, భానుప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

కడియం, మార్చి 13: కడియపులంకలో ఓ పేకాట శిబిరంపై బుధవారం కడియం పోలీసులు దాడి చేశారు. సీఐ బి తులసీధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడియపు లంక ఏటిగట్టు ప్రాంతంలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని, ఒక వ్యక్తి పారిపోయాడని తెలిపారు. వారి నుంచి రూ.9,740, ఐదు సెల్ ఫోన్లు, ఐదు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పేకాట శిబిరాలపై నిరంతర నిఘా ఉంచామని ఈ సందర్భంగా సీఐ తులసీధర్ తెలిపారు.

అనుమతులు లేకుండా మెడిసిన్ విక్రయిస్తే చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అవసరమైన అనుమతులు పొందకుండా మందులు (మెడిసిన్) విక్రయించడం నేరమని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని డ్రగ్స్ విక్రయ సంస్థల పార్శిల్ కార్యాలయాల్లో, గోదాముల్లో బుధవారం తనిఖీలు చేశామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదాలమ్మనగర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, టీసీఐ ఎక్స్‌ప్రెస్ లిమిటెడ్ పార్శిల్ కార్యాలయాల్లో సోదాలు చేసి ట్రేడ్ లైసెన్సులు లేకపోవడం గుర్తించామన్నారు. వారికి మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నోటీసులు జారీ చేశారని చెప్పారు. శాంపిల్ మందులు ఉండడంతో వాటిని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సీజ్ చేసి నోటీసులు ఇచ్చారన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలునాయుడు, సిబ్బంది వెంకట నాగరాజు, భార్గవ మహేశ్, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

పసిబాలుడిని గోనె సంచిలో కట్టి వదిలేశారు..

గమనించి జీజీహెచ్‌కు తరలించిన స్థానికులు



సర్పవరం జంక్షన్, మార్చి 13: ఎవరికి ఏం కష్టమొచ్చిందో..ఏం అడ్డం వచ్చిందో తెలియదు కానీ రోజుల వయస్సు ఉన్న పసి బాలుడిని కాకినాడ బోట్‌క్లబ్ దగ్గర వదిలేసి వెళ్లిపోయారు. కాకినాడ ఒకటో డివిజన్ పరిధిలో బోట్‌క్లబ్ పార్కు ఉంది. దీని ప్రధాన ద్వారం పిఠాపురం వెళ్లే రహదారిలో ఉంది. బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో పార్కులో నుంచి చిన్నారి గుక్కతిప్పుకోకుండా ఏడుస్తున్న విషయాన్ని గమనించిన సందర్శకులు గోనె సంచి మూట విప్పి చూడటంతో రోజుల వయసు ఉన్న బాబు ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. అప్పటికే చిన్నారి నోటి నుంచి నురగలు రావడం, శరీరంపై పొక్కులు రావడాన్ని గమనించి, వెంటనే 108 కు సమాచారం అందించగా, మెరుగైన చికిత్స కోసం చిన్నారి బాలుడిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు ఎస్ఐసీయూలో ఉంచి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారి వయసు 3 నుంచి 5 రోజులు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. చిన్నారిని పార్కులో వదిలేసి అప్పటికే 10 నిమిషాలు అయి ఉంటుందని, వెంటనే సందర్శకులు గమనించి సమాచారం ఇవ్వడంతో బాలుడికి ప్రమాదం తప్పిందని వైద్యులు భావిస్తున్నారు. బోట్‌క్లబ్ పార్కు లోపల, బయట వీధికుక్కల గుంపు ఉందని, చిన్నారిని కుక్కలు చూచి ఉంటే పరిస్థితి ఘోరంగా ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

భీమేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.29,46,474



ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సామర్లకోట, మార్చి 13: పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఈ నెల 6 నుంచి 11 వరకూ జరిగిన మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల నుంచి హుండీల ద్వారా, పూజా రుసుముల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం రూ.29 లక్షల 46 వేల 474 లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం వెల్లడించారు. బుధవారం ఉదయం నుంచి భక్త మండలి కమిటీ ప్రతినిధులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు నిర్వహించారు. గత ఏడాది ఆదాయంతో పోలిస్తే కేవలం రూ.3.80 లక్షలు మాత్రమే అదనంగా లభించింది. ఉత్సవ ఖర్చులు మాత్రం పెద్ద మొత్తంలో అయినట్లు సమాచారం. మహాశివరాత్రి ఉత్సవాలలో భక్తుల దర్శనాల ద్వారా రూ.9,00,910, సేవలో రూ.92,517, అన్నదానాల విరాళాల ద్వారా రూ.5,05,922, హుండీల ద్వారా రూ.12,00,080, లడ్డూల ద్వారా రూ. 1,42,815, పులిహోర విక్రయాల ద్వారా రూ. 1,04,830 లభించినట్లు తెలిపారు. గత ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలకు రూ. 25,26,555 ఆదాయం లభించినట్లు ఈవో నీలకంఠం తెలిపారు.

ఓటు హక్కు వినియోగం ప్రతీ ఒక్కరి బాధ్యత

యానాం, మార్చి 13: నూరుశాతం పోలింగ్ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పరిపాలనాధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్‌పి మునిస్వామి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఓటు ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కృషి చేయాలన్నారు.

జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు అమలాపురం ప్రాజెక్టు



జాతీయస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందిస్తున్న అధికారులు

అమలాపురం టౌన్, మార్చి 13: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు జిల్లా నుంచి ఒక ప్రాజెక్టు ఎంపికైనట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కా సత్యప్రవీణ్ రూపొందించిన ప్లాంట్ గ్రోయింగ్ మెషీన్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో అద్భుత ప్రతిభ చాటి జాతీయ స్థాయికి ఎంపికైంది. చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజు నుంచి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. విద్యార్థి సత్యప్రవీణ్, గైడ్ ఉపాధ్యాయుడు చంద్రారెడ్డిని పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు జి.నాగమణి, డీఈవో ఎం.కమలకుమారి, డీవైఈవో ఎస్ఎల్ నరసింహఫణి, విద్యా శాఖ ఏడీలు సురేష్, విజయలక్ష్మి, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం అధికారి హనుమంతరావు, బొజ్జా రమణశ్రీ, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం అభినందించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, మార్చి 13: టీడీపీ కపిలేశ్వరపురం మండలం తాతపూడి గ్రామ కమిటీ అధ్యక్షుడు జగ్గింశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసీపీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. బుధవారం మండపేట పట్టణ టీడీపీ కార్యాలయంలో కె.గోవింద్, టేకి రాంబాంబు, టేకి మునియ్య, మాచరయ్య, సూరయ్య, సత్యనారాయణ తదితరులు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మేకా శ్రీధర్, మేకా ప్రసాద్, కాళి దాసు సూకరాజు, పెట్టా అభిమన్యుడు, మరివాడ బుల్లి రాజు, జె.నాగేశ్వరరావు, సూరంపూడి ధనరాజు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికల నిర్వహణ కోసం కవాతు



అమలాపురం: బండారులంకలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

అమలాపురం రూరల్, మార్చి 13: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు, సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో పాటు పోలీసులు కవాతు నిర్వహించారు. అమలాపురం మండలం బండారులంక, నడిపూడి, పాలగుమ్మి గ్రామాలతో పాటు లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం, మాచవరం, తొండవరం, వాకలగరువు, కె.పెదపూడి, పుల్లేటికుర్రు, అంగర, టేకి తదితర గ్రామాల్లో బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో పోలీస్ కవాతు

కపిలేశ్వరపురం, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంగర, పడమరఖండ్రిక, టేకి గ్రామాల్లో పోలీస్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. టేకి గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని అంగర ఎస్‌ఐ ఎ.పరదేశి సూచించారు. మండపేట సీఐ శ్రీధర్, ఎస్‌ఐ పరదేశి పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఆత్రేయపురం, మార్చి 13: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సీఐ ఎం.రామ్‌కుమార్ కోరారు. బుధవారం వాడపల్లి, లొల్ల, మెర్లపాలెం గ్రామాల్లో ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో సీఐఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. అధిక శాతం పోలింగ్ నమోదయ్యేలా ప్రజలకు రక్షణ కల్పిస్తామని వారు ప్రజలకు వివరించారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

అంతర్వేది, మార్చి 13: టేకిశెట్టిపాలెంలో 42మంది లబ్ధిదారులకు రామేశ్వరంలో కేటాయించిన భూముల్లో రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలు బుధవారం పంపిణీ చేశారు. 5వ వార్డు సభ్యుడు, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడుతూ పట్టాలిచ్చారు గానీ ఇంతవరకు పూర్తి స్థాయిలో పట్టా భూములను అధికారులు లబ్ధిదారులకు చూపించలేదన్నారు. భూములు చూపించి లబ్ధిదారులకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో సుధాకర్, ఉపసర్పంచ్ కటికిరెడ్డి మహేష్, విస్సా తాతయ్యనాయుడు పాల్గొన్నారు.



లబ్ధిదారులను ఆరా తీస్తున్న మాలే శ్రీనివాసనగేష్



బండారులంకలో గోవుకు సీమంతం నిర్వహిస్తున్న కిశోర్‌భవానీ దంపతులు

గోమాత శ్రీలక్ష్మికి సీమంతం

అమలాపురం రూరల్, మార్చి 13: బండారులంక మాడావారి వీధిలో గోమాత శ్రీలక్ష్మికి బుధవారం శాస్త్రోక్తంగా సీమంతం నిర్వహించారు. గ్రామానికి చెందిన బళ్ల కిశోర్-భవానీ దంపతులు ఎంతో ప్రేమగా పెంచిన గోమాత శ్రీలక్ష్మి తొలిచూలు కట్టడంతో గ్రామ పెద్దలు, ముత్తయిదువుల సమక్షంలో పురోహితుడు బళ్ల సత్తిబాబు సీమంతం జరిపించారు. కిశోర్-భవానీ దంపతులతో పాటు బళ్ల హనుమంతరావు-హైమావతి, పార్వతీశం-సూర్యావతి, ఆశపు పల్లపురాజు-లక్ష్మికుమారి దంపతులు కర్తలుగా గోపూజ చేశారు. ముత్తయిదువులకు సారె, తాంబూలాలు అందించి ప్రత్యేక విందు ఇచ్చారు.

● టీడీపీ, జనసేన, బీజేపీ ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు
● టీడీపీ నాయకులతో సమీక్ష

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి







ఐ.పోలవరం: టీడీపీ, జనసేన నాయకులతో సమీక్షిస్తున్న దాట్ల బుచ్చిబాబు, రాయవరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగేశ్వరరావు, ఆత్రేయపురం: ర్యాలిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో బండారు సత్యానందరావు

ఐ.పోలవరం, మార్చి 13: టీడీపీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లో విరివిగా ప్రచారం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ముమ్మిడివరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సూచించారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాల నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఐ.పోలవరం మండలంలోని 14పంచాయతీలు, కాట్రేనికోన మండలంలోని 16పంచాయతీల్లో కుటుంబ సాధికార సారథులుగా పనిచేస్తున్న వారికి సూచనలు చేశారు. సైకిల్ గుర్తుకు ఓటేసి ముమ్మిడివరంలో తనను గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, నడింపల్లి సుబ్బరాజు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, సాకా సీతాదేవి, గంజా సుధాకర్, చెయ్యేటి శ్రీను బాబు, జనిపెల్ల సోమన్న, బీర సత్యకుమారి, ముదునూరి లింగరాజు, చిలువూరి సుబ్బరాజు, గాదిరాజు విశ్వనాధరాజు, ఆకాశం శ్రీనివాస్, బొంతు శ్రీరాములు, దాసరి జగదీశ్వరి, వనచర్ల వెంకటేశ్వరరావు, ఏలూరి మూర్తి, చోడిశెట్టి బ్రహ్మానందం పాల్గొన్నారు.

కూటమి అధికారంలోకి రావడం ఖాయం: వేగుళ్ల

రాయవరం, మార్చి 13: వచ్చేఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించి అధికారంలో రావడం ఖాయమని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. బుధవారం వెంటూరు, కూర్మాపురం, కురకాళ్లపల్లి గ్రామాల్లో బూత్ ఇన్‌చార్జ్‌లు, కుటుంబ సాధికార సారథులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ వీవీవీ చౌదరి(కూర్మాపురం అబ్బు) మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాకా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, టీడీపీ అధికారంలోకి వస్తే నాణ్యమైన పరిపాలన అందిస్తామన్నారు. రాష్ట్రానికి కియాలాంటి పరిశ్రమలు రావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నావిజన్ ఉన్న చంద్రబాబు అధికారంలో రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా పనిచేసి వైసీపీని గద్దెదింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నేతలు గొడితి సత్యం, రుద్రా సతీష్, చౌటపల్లి చంటి, సూరంపూడి ఆంజనేయులు, ఇళ్ల శ్రీనివాస్, బీజేపీ నేతలు చాత్రాతి జానకి రాంబాబు, చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, టీడీపీ నేతలు రిమ్మలపూడి వేణుగోపాలదొర, కాదా ప్రభాకరరావు, కొప్పిశెట్టి మాధవరావు, దేవళ్ల వెంకట్రావు, గుణ్ణం పనసయ్య, సూరంపూడి హరిశ్చంద్ర ప్రసాద్, చిరట్ల అప్పారావు పాల్గొన్నారు.

రానున్నది ఉమ్మడి ప్రభుత్వమే

ఆత్రేయపురం, మార్చి 13: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గర్లోనే ఉందని... ప్రజలు టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంపై మొగ్గుచూపుతున్నారని కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం ర్యాలి గ్రామంలో సమితి మాజీ అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు నాయకత్వంలో 50మంది వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ బండారు పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలమూరులో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలలో మొల్ల చిత్రపటానికి పూలమాలలువేసి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

జ్ఞాన సంపదకు మహాకవయిత్రి 'మొల్ల' ప్రతీక

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

ఆలమూరు, మార్చి 13: మహిళా శక్తికి, జ్ఞాన సంపదకు ప్రతీకగా నిలిచిన మహా కవయిత్రి మొల్లమాంబ జయంతిని ఆలమూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరు మండల శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్షుడు మల్లవరపు మల్లేశ్వరరావు అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మొల్ల చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. అలతి, అలతి పదాలతో రామాయణాన్ని తెలుగులో రాసి తన సరళమైన పదజాలానికి అందరూ ముగ్ధులయ్యేలా మొల్లమాంబ చేసిందన్నారు. ఆమె రాసిన రామాయణం మొల్ల రామాయణంగా ఎంతో ప్రసిద్ధి చెందిందని, రామాయణాన్ని తెలుగులో రాసిన తొలి కవయిత్రిగా ఆమె ఖ్యాతి గడించిందన్నారు. అటువంటి మహా కవి నేటి తరం యువతకు ఎంతో ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆలమూరు మండల శాలివాహన కుమ్మరి సంఘం నాయకులు, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: కవయిత్రి మొల్లమాంబ జయంతి ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. మొల్లమాంబ చిత్రపటానికి శాలివాహన సంఘం కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దాలిపర్తి పాపారావు, మండల అధ్యక్షుడు మాగాపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కోటిపల్లి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఏడిద వీరబాబు, పేరూరి వెంకటేశ్వరరావు, కోటిపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అంబాజీపేట: సంస్కృతంలో ఉన్న రామయణాన్ని సులభంగా తెలుగు పదాలతో రచించిన మొల్ల సేవలు మరువలేనివని జిల్లా సంఘఅధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మం అన్నారు. మాచవరంలోని శాలివాహన సంఘం భవనంలో మొల్ల జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పలు రచనలతో సమాజంలో చైతన్యం తీసుకువచ్చి మంచి రచయిత్రిగా గుర్తింపు పొందిన మహిళ మొల్ల అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదుర్తి నారాయణమూర్తి, చిరతపూడి హేమలత, మంతెన శ్రీనివాసరావు, ర్యాలీ శ్రీనివాస్ వడయార్ పాల్గొన్నారు.

కె.గంగవరం: తొలి తెలుగు కవయిత్రి, రామాయణాన్ని తెలుగులో అనువదించిన మొల్లమాంబ జయంతి వేడుకలు బుధవారం కె.గంగవరంలో కుమ్మరి సాలివాహన సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శీతల పానీయం, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి సాలివాహన సంఘం నాయ కులు ఏడిద నాగరాజు, ఏడిద నరశింహమూర్తి, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, ఏడిద వెంకట రమణ, కోటిపల్లి తాతారావు, ఆదుర్తి గోపాలరావు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడాలి

అంబాజీపేట, మార్చి 13: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు టీడీపీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోనుప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీర వెంకట సత్యనారాయణ కోరారు. బుధవారం పుల్లేటికుర్రులో యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ కమిటీల కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాసరావు, సుంకర గణపతిరావు, నేదునూరి వెంకటరమణ, దొమ్మేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హాల్ టిక్కెట్లు పంపిణీ

అల్లవరం, మార్చి 13: అల్లవరం జడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు విద్యా కమిటీ చైర్మన్ గెద్దాడ శ్రీనివాసరావు హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వంలో క్రైస్తవ మందిరాలపై దాడులు



వద్దిపర్రులో దగ్ధమైన చర్చిని పరిశీలిస్తున్న రాష్ట్ర టీడీపీ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు స్వామిదాస్

ఆత్రేయపురం, మార్చి 13: జగన్ హయాంలో క్రైస్తవులపైనా, చర్చిలపైనా అనేక దాడులు జరిగాయని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటే స్వామిదాస్ విమర్శించారు. వద్దిపర్రు కాలువ రేవులో దగ్ధమైన బైబిల్ మిషన్ చర్చిని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం పాస్టర్ మోషేతో మాట్లాడి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో చర్చిలపై అనేక సందర్భాల్లో దాడులు జరిగాయని వివరించారు. గతంలో చంద్రబాబు సీఎంగా వున్నప్పుడు ఇటువంటివి జరగలేదన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, చర్చి నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.నవీన్‌కుమార్, సాల్మన్‌రాజు, జయకుమార్, చేపల రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

ఆత్రేయపురం, మార్చి 13: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కోటిపల్లి శేషబాస్కరరావు-రూప దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా బుధవారం ఒక్కరోజు ఆదాయం రూ.1,87,521 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

సర్కార్ ఎక్స్‌ప్రెస్ పుదుచ్చేరి వరకు పొడిగింపు

● స్వీట్స్ పంచిన కాంగ్రెస్ నాయకులు

యానాం, మార్చి 13: కాకినాడ నుంచి పుదుచ్చేరికి సర్కార్ ఎక్స్‌ప్రెస్ బయలుదేరింది. కాకినాడ నుంచి బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 9.50గంటలకు పుదుచ్చేరి చేరుకోనుంది. ఈసందర్భంగా కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో యానాం కాంగ్రెస్ నాయకులు మల్లాడి సత్తిబాబు తదితరులు హర్షం ప్రకటించి, స్వీట్లను పంచారు. కాకినాడ నుంచి చెంగల్‌పట్టు వరకు ఉన్న సర్కర్ ఎక్స్‌ప్రెస్‌ను పుదుచ్చేరి వరకు పొడిగించేందుకు కృషిచేసిన పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగానికి యానాం ప్రజల తరపున కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సర్కార్‌కు ఎంపీ వైద్యలింగం ఫ్లెక్సీకి కట్టి జెండా ఊపి ప్రయాణికులకు, రైల్వే సిబ్బందికి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పిల్లి చిన్న, పోలిశెట్టి శ్రీనివాసు, మూర్తి, పబ్బినీడి కృష్ణా, లంక వెంకన్నబాబు, దున్న చక్రవర్తి, ప్రసాద్ మున్నా, చౌదరి, గణేష్, స్టేషన్ ఇంచార్జ్ రమేష్‌కుమార్, సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

అల్లవరం, మార్చి 13: యెంట్రుకోన కాలువ గట్టు వద్ద నిర్మించిన కోదండ రామాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాంతి కల్యాణం, విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠలు వేడుకగా జరిగాయి. వైఖానస ఆగమ మహదాచార్య సుదర్శనం వెంకటజనార్దనాచార్యులు నేతృత్వంలో వేదపండితులు పూర్ణాహుతి, హోమాలు, ప్రత్యేక పూజలు జరిపారు. సీతారాముల విగ్రహాల దర్శనానికి, అన్నసమారాధానికి భక్తులు పోటెత్తారు. ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాస్, వాసంశెట్టి సుభాష్, గుబ్బల చినసత్యనారాయణ, మొల్లేటి సాయిబాబా, గెద్దాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

అల్లవరం, మార్చి 13: అల్లవరం,కొమరగిరిపట్నం, మొగళ్ళమూరు, గుండెపూడి, డి.రావులపాలెం, గూడాల, గోడి, రామేశ్వరం, కొమరగిరిపట్నం, కోడూరుపాడు, యెంట్రుకోన గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ ఇళ్ళ శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుగు గౌతమి, కొనుకు బాపూజీ, తిక్కా వెంకటప్రసాద్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, సర్పంచ్‌లు నడింపల్లి సుబ్బరాజు, సాధనాల వెంకట్రావు, ఉండ్రు భగవాన్‌దాస్, దాకారపు చిరంజీవి, రాయుడు విష్ణు, తోట శ్రీదేవి, బొమ్ము బాలవేణి, రాకాపు విజయలక్ష్మి, ఏవో ఎన్వీవీ సత్యనారాయణ, ఏఈలు సంపన్, స్వామి, ఓఎన్జీసీ అధికారులుపాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: బాయ్స్
వెంకటరమణ	: ఆపరేషన్ వాలంటైన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: ఊరిపేరు భైరవకోన
శేఖర్ స్క్రీన్-2	: బుల్లెట్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: భీమ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: రికార్డు బ్రేక్

ఆరోగ్య సురక్ష శిబిరం

ముమ్మిడివరం, మార్చి 13: ప్రజలకు ఇంటి వద్దకే వైద్యం అందించేందుకు ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గొల్లలవీధి సచివాలయ పరిధిలోని 4,5,6వార్డులకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 శిబిరాన్ని నిర్వహించారు. 150మందికి వైద్యులు యోగిత, కేజియా, పీబీవీ రమణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ సూకరాజు, సచివాలయ, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలి

మామిడికుదురు, మార్చి 13: మహిళలు పురుషులతో సమానంగా ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆకాంక్షించారు. మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో గెయిల్ శిక్షణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ తీసుకున్న 54 మహిళలకు గెయిల్ సంస్థ అందించిన కుట్టుమిషన్‌తో పాటు సర్టిఫికెట్లను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గెయిల్ సంస్థ ప్రతినిధులు ఎ.సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆసరా, చేయూత చెక్కుల పంపిణీ

రాయవరం, మార్చి 13: రాయవరం వీఎస్ఎం కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ ఆసరా క్రింద 1479 సంఘాలకు రూ.13.70కోట్లు, చేయూత క్రింద రూ.7కోట్లు రాయవరంలో బుధవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ, జడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కుమారుడు పృథ్వీరాజ్, ఏఎంసీ మాజీ చైర్మెన్ సిరిపురపు శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కేశవరంలో ఎన్నికల ప్రచారం

మండపేట, మార్చి13: కేశవరంలో వైసీపీ శ్రేణులు దూలం వెంకన్నబాబు, అన్నందేవులు చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవులు, కృష్ణ, అల్లంపల్లి కిశోర్, మాజీ ఎంపీటీసీ తుపాకులు ప్రసన్నకుమార్ ఇం టింటా తిరిగి వైసీపీ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులును గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

తాపేశ్వరం నోబుల్‌స్కూల్ వార్షికోత్సవం

మండపేట, మార్చి 13: తాపేశ్వరం నోబుల్‌స్కూల్ వార్షికోత్సవం బుధవారం ప్రిన్సిపాల్ రాజవరపు శ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సహాయం

ఉప్పలగుప్తం, మార్చి 13: పెదగాడవిల్లికి చెందిన ఆటో డ్రైవర్ గాలి శ్రీధర్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం బాధితునికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కట్టా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కుంచే రవి, గోడి నాని, గెద్దాడ శివశంకర్ పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణాలతో ప్రారంభోత్సవాలు

అంతర్వేది, మార్చి 13: సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం గ్రామంలో వెల్‌నెస్ సెంటర్, ఆర్బీకే కేంద్రం అసంపూర్తి నిర్మాణంలో ఉండగానే ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు బుధవారం ప్రారంభించారు. ఎన్నికల కోడ్ వస్తున్న నేపథ్యంలో ఎటువంటి ముందస్తు కార్యాచరణ లేకుండా ప్రారంభోత్సవాలు చేపట్టడంపై పలు విమర్శలు వస్తున్నాయి.

చదువులమ్మ చెట్టు నీడలో..

ఉప్పలగుప్తం, మార్చి 13: ఐదేళ్లు చెట్టాపట్టాలేసుకుని హుషారుగా చదువులమ్మ చెట్టు నీడలో సేదదీరిన విద్యార్థులు ఎవరికి వారుగా వేరైపోతున్న వేళ ఆ పాఠశాలల్లో ఒకింత విచారం, మరింత ఆనందం వెల్లివిరిసింది. గొల్లవిల్లి, భీమనపల్లి ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు బుధవారం వీడ్కోలు సమావేశాలు ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్య అతిథులు పలు సూచనలు చేశారు. విడిపోతున్నందుకు విద్యార్థుల్లో కొందరు కంటతడి పెట్టారు. చివరగా ఒకరికొకరు సంతోషంతో వీడ్కోలు చెప్పుకున్నారు. హెచ్‌ఎంలు లంక రాణి, నూకల సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

మామిడికుదురు, మార్చి 13: అప్పనపల్లిలో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామికి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, చామంతి పూలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. స్వామివారికి సింధూరపూజ, తమలపాకుల పూజ తదితర కార్యక్రమాలను ఘనంగా జరిపారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

ఆలమూరు, మార్చి 13: పెదపళ్లలో రుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నూతన శిలావిగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల17న విగ్రహ ప్రతిష్ఠకు వేదపండితులు నిర్ణయించారు. బుధవారం వేదపండితుడు వాడపల్లి వేణుగోపాలాచార్యులు పర్యవేక్షణలో వేదపండితులు ప్రత్యేక పూజలుజరిపి మట్టిని సేకరించారు.

మీకు రక్షణగా మేముంటాం... స్వేచ్ఛగా ఓటేయండి

అంబాజీపేట, మార్చి 13: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు మీకు రక్షణగా మేముంటామని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, సీఐఎస్ఎఫ్ కమాండర్లు పేర్కొన్నారు. అంబాజీపేట ఎస్‌ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో మాచవరం, అంబాజీపేట, నందంపూడి, తొండవరం, వాకలగరువు, కె.పెదపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుమన్నారు. ఏఎస్‌ఐ భగవన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన సీఐ

రామచంద్రపురం (ద్రాక్షారామ), మార్చి 13: రామచంద్రపురం పట్టణంలో ఇంటర్ పరీక్షలు పురస్కరించుకుని సీఐ దొరరాజు బుధవారం వికాస్ జూనియర్ కళాశాలతో పాటు ఇతర కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

వంట పాత్రలు బహూకరణ

ఐ.పోలవరం, మార్చి 13: ముమ్మిడివరానికి చెందిన ఆదిరాజు ప్రభాకరం, సతీష్ దంపతులు మురమళ్ళ వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు రూ.20వేలు విలువైన వంట పాత్రలు బహూకరించారు. ఆలయ పర్యవేక్షణాధికారి బి.వీరభద్రరావుకు బుధవారం వీటిని అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. దాతలను చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

గీతాంజలి మృతిపై న్యాయవిచారణ చేయాలి

మండపేట, మార్చి13: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి ఆత్మహత్యపై ప్రభుత్వం న్యాయవిచారణ చేసి నిందితులను శిక్షించాలని బీసీ సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం, బీసీ మైనార్టీ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గీతాంజలి మృతికి సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను శిక్షించాలని కోరుతూ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశ్వబ్రాహ్మణ, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన గౌడ సంఘీయులు

మండపేట, మార్చి 13: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. బుధవారం 30వ వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణ గౌడ సంఘీయులు మార్యాదపూర్వకంగా తోటను కలిశారు. గౌడ సంఘ నాయకులు సమస్యలను తోటకు వివరించారు. గౌడసంఘ పట్టణ అధ్యక్షుడు యేకుల శ్రీనువాసరావు, కార్యదర్శి దాసరి గంగాధర్, బెల్లంకొండ రాజు, తీగిరెడ్డి వీర్రాజు, దాసరి ఆదినారాయణ, కాయల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతావారిపేట రోడ్డును ప్రారంభించిన ఎంపీ

పి.గన్నవరం, మార్చి 13: ఉడిమూడి శివారు చింతావారిపేటలో ఎంపీ నిధులు రూ.10లక్షలు, జడ్పీ నిధులు రూ.5లక్షలు, ఆర్థికసంఘం నిధులు రూ.5లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్డును ఎంపీ చింతా అనురాధ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, స్థానిక నాయకులు సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, పుచ్చకాయల తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ అభయహస్తం పథకంపై ప్రచారం

కాట్రేనికోన, మార్చి 13: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు ఆధ్వర్యంలో బుధవారం కాట్రేనికోనలో ఇంటింటికీ వెళ్లి ఇందిరమ్మ అభయహస్తం పథకాలపై వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద కుటుంబాల ఖాతాల్లో ప్రతి నెల రూ.5వేలు పడతాయన్నారు. ముషిణి రామకృష్ణారావు, సాధనాల నానాజీ, పాలెపు ధర్మారావు, వడ్డి నాగేశ్వరరావు, నక్కా వెంకటేశ్వరరావు, దివి వెంకన్నబాబు, గోడి భాస్కరరావు పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై సమావేశం

కపిలేశ్వరపురం, మార్చి 13: స్థానిక మండల పరిషత్ సమావేశంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌పై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ మహిళా పోలీసులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ఏవీవీఎస్ఆర్ఎస్ కొండలరావు మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో భాగంగా తీసుకోవలసిన చర్యల గురించి పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. సమావేశంలో మండలపరిషత్ కార్యాలయ ఏవో ఎంవీఎం ప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వినాయక ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన పూజలు

అంబాజీపేట, మార్చి13: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ పునఃనిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆలయ అర్చకులు మర్ల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కార్నియా దానం

రాయవరం, మార్చి13: రాయవరానికి చెందిన చంద్రమళ్ల ప్రవీణ్(24) మృతి చెందాడు. అతడి కార్నియాను కుటుంబ సభ్యులు దానంచేశారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ ప్రతినిధులు ప్రవీణ్ కార్నియాను సేకరించి తీసుకువెళ్లారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో అన్న మృతిచెందగా వేదనతో తమ్ముడు ప్రవీణ్ మృతిచెందాడు. ఇద్దరుకమారులను కోల్పోయిన విషాదంలోశ్రీను, అనిత దంపతులు కుమారుడి కార్నియాను దానంచేశారు. వారిని వలంటరీ బ్లడ్‌డోనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెలగల ఫణికృష్ణారెడ్డి అభినందించారు.